కేసీఆర్ పోరుబాట

మొదటిపేజీ తరువాయి...

నుంచి ప్రారంభించనున్నారు. మొదటిరోజు మిర్యాలగూడలో ప్రారంభమై హుజూర్‌నగర్, కోదాడ మీదుగా సూర్యాపేట చేరుకొని రాత్రికి అక్కడే బస చేయనున్నారు. మరుసటి రోజు సూర్యాపేట నుంచి తిరుమలగిరి, జనగామ, ఆలేరు మీదుగా రాత్రికి ఎర్రవల్లికి చేరుకోనున్నారు. మూడో రోజు ఎర్రవల్లిలో మొదలై వరంగల్‌లో రోడ్‌షో చేయనున్నారు. రాత్రి అక్కడే ఉంటారు. మరుసటిరోజు తొర్రూరు, మరిపెడ నుంచి ఖమ్మం చేరుకునేలా యాత్రకు రూపకల్పన చేస్తున్నారు. ఆ రాత్రి ఖమ్మంలో బస చేసిన అనంతరం వైరా, తల్లాడ, కొత్తగూడెంలలో రోడ్‌షోలో కేసీఆర్ పాల్గొననున్నారు. ఆ రాత్రి కొత్తగూడెంలో బస చేసి.. అక్కడి నుంచి ఇల్లెందు, మహబూబాబాద్, నర్సంపేటలో రోడ్‌షోలలో పాల్గొని రాత్రి వరంగల్ చేరుకోనున్నారు. మరుసటి రోజు భూపాలపల్లి, పరకాల, జమ్మికుంటల్లో జరిగే ప్రచారంలో పాల్గొననున్నారు. రాత్రి సింగాపురంలో ఉంటారు. అక్కడి నుంచి మరుసటిరోజు పెద్దపల్లి, రామగుండం,

మంచిర్యాలల్లో ప్రచార కార్యక్రమంలో పాల్గొంటారు. మంచిర్యాల నుంచి నేరుగా కరీంనగర్ చేరుకొని అక్కడ బస చేస్తారు. కరీంనగర్ నుంచి జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లిలో రోడ్‌షోలలో పాల్గొంటారు. రాత్రి మెట్‌పల్లిలో ఉండి తర్వాతి రోజు బాల్కొండ అసెంబ్లీ నియోజకవర్గంలోని మోర్తాడ్, కమ్మర్‌పల్లి తదితర గ్రామాల్లో రోడ్‌షోల్లో పాల్గొని ఆర్మూరు మీదుగా నిజామాబాద్ చేరుకుంటారు. రాత్రి నిజామాబాద్‌లో బస చేస్తారు. అనంతరం నిజామాబాద్ నుంచి బాన్సువాడ, ఎల్లారెడ్డి నుంచి మెదక్ చేరుకుంటారు. మెదక్‌లో బస చేసి తర్వాతి రోజు నర్సాపూర్, మేడ్చల్, పటాన్‌చెరువు నియోజకవర్గాల్లో జరిగే రోడ్‌షోలలో పాల్గొంటారు. రాత్రి హైదరాబాద్‌లో బసచేస్తారు. తర్వాత రోజు నాగర్‌కర్నూలు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని వనపర్తి, నాగర్‌కర్నూల్‌లో పర్యటించి రాత్రి వనపర్తిలో బస చేసే అవకాశం ఉన్నది. అక్కడి నుంచి తెల్లారి జోగులాంబ అమ్మవారిని దర్శించుకొని ఐజ, గద్వాలలో ప్రచారంలో పాల్గొంటారు. గద్వాలలో రాత్రి బస చేస్తారు. మిగిలిన నియోజకవర్గాలకు సంబంధించిన రూట్‌మ్యాప్ ఇంకా ఖరారు కాలేదు. ఒకట్రెండు రోజుల్లో దీనికి సంబంధించి స్పష్టమైన రూట్‌మ్యాప్‌ను పార్టీ విడుదల చేయనున్నది. అయితే, ముగింపు సభ మాత్రం సిద్దిపేటలో పెట్టాలని యోచిస్తున్నారు. రోడ్‌షోలతోపాటు మధ్యమధ్యలో ఒకట్రెండు చోట్ల సభలను కూడా పెట్టాలని పలువురు అభ్యర్థులు కోరుతున్నారు. దీనిపై కూడా ఆలోచిస్తున్నారు.

కేసీఆర్ బస్సుయాత్రకు అనుమతి ఇవ్వండి

సీఈవో వికాస్‌రాజ్‌కు బీఆర్ఎస్ వినతి

హైదరాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): లోకసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ నెల 22 నుంచి మే 10వరకు తలపెట్టిన బస్సు యాత్రకు అనుమతి ఇవ్వాలని సీఈవో వికాస్‌రాజ్‌ను బీఆర్ఎస్ కోరింది. ఈ మేరకు బీఆర్ఎస్ అధికార ప్రతినిధి కే వాసుదేవరెడ్డి శుక్రవారం వికాస్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. యాత్రలో పోలీసులు భద్రతా చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని.. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ఈసీ ప్రత్యేక దృష్టి పెట్టాలని విజ్ఞప్తిచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ కార్యకర్తలు, సోషల్ మీడియా వారియర్స్‌పై దాడులు చేస్తూ, బీఆర్ఎస్ ఫ్లెక్సీలను, బ్యానర్స్‌ను తొలగిస్తున్నదని తెలిపారు. ఇటీవల బీఆర్ఎస్ చేవెళ్ల సభ, మెదక్, జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో నిర్వహించిన సభల సందర్భంగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను తొలగించారని ఫిర్యాదుచేశారు.

కపటనీతికి మారుపేరు కాంగ్రెస్

- అసలు రంగు ఇప్పుడిప్పుడే బయటపడుతున్నది
- నిరుద్యోగులు గుణపాఠం చెప్పాలి: కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): కపటనీతికి మారుపేరు కాంగ్రెస్ అని, అన్ని వర్గాలను మోసం చేసిన చరిత్ర కాంగ్రెస్‌ది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఆరోపించారు. ముఖ్యంగా యువతకు అరచేతిలో వైకుంఠం చూపించి తెలంగాణలో అధికారంలోకి వచ్చిందని, కానీ 120 రోజుల పాలనలోనే నిరుద్యోగులతో సహా అందరికీ ద్రోహం చేస్తున్నదని విమర్శించారు. కాంగ్రెస్ అసలు రంగు ఇప్పుడిప్పుడే బయటపడుతున్నదని, తమని నట్టేట ముంచిన కాంగ్రెస్‌కు నిరుద్యోగ యువత గుణపాఠం చెప్పాల్సిన సమయం వచ్చిందని పిలుపునిచ్చారు. శుక్రవారం ఎక్స్ వేదికగా కాంగ్రెస్ మోసాలపై కేటీఆర్ స్పందించారు. అధికారంలోకి

వచ్చిన వెంటనే నిరుద్యోగులకు రూ.4 వేల నిరుద్యోగ భృతి అందిస్తామని ప్రియాంకగాంధీ వంటి కాంగ్రెస్ అగ్రనాయకులు హామీ ఇచ్చారని, కానీ ఆ హామీనే ఇవ్వలేదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట మార్చారని గుర్తుచేశారు. ఫిబ్రవరి 1 నుంచి ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తామని అన్ని వార్తాపత్రికల మొదటి పేజీలో తమ జాబ్ క్యాలెండర్‌ను ప్రకటన ఇచ్చిందని, వాస్తవానికి బీఆర్ఎస్ హయాంలో భర్తీ చేసిన 30 వేల ఉద్యోగాలకు కేవలం నియామక పత్రాలను ఇచ్చి ఆ ఉద్యోగాలను నిస్సిగ్గుగా తమ ఖాతాలో వేసుకుంటున్నదని ధ్వజమెత్తారు. అన్ని పోటీ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చి.. టెట్ పరీక్ష ఫీజును రూ.400 నుంచి రూ.2 వేలకు పెంచిందని విమర్శించారు. బల్మూరి వెంకట్ వంటి కాంగ్రెస్ నాయకులు ఎన్నో కోర్టు కేసులు వేసి అనేక పోటీ పరీక్షలు రద్దవటానికి కారణమయ్యారని మండిపడ్డారు. నిరుద్యోగుల ఉసురు పోసుకుని, ప్రతిఫలంగా వెంకట్ ఎమ్మెల్సీ పదవిని అందుకున్నారని, ఉద్యోగార్థులను మాత్రం కాంగ్రెస్ దిక్కుతోచని స్థితిలో వదిలేసిందని దుయ్యబట్టారు.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు

రిటర్నింగ్ అధికారి ఉదయ్‌కుమార్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్



అదనపు కలెక్టర్, రిటర్నింగ్ ఆఫీసర్ పాటిల్ హేమంత్ కేశవ్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న పద్మారావు గౌడ్

రెండో రోజు 57 నామినేషన్లు

అత్యధికంగా సికింద్రాబాద్, నిజామాబాద్‌లో ఆరు చొప్పున దాఖలు

హైదరాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ)/ న్యూస్‌నెట్‌వర్క్ : రాష్ట్రవ్యాప్తంగా రెండో రోజూ లోక్‌సభ ఎన్నికలకు నామినేషన్ల పర్వం కొనసాగింది. శుక్రవారం నాడు 57 నామినేషన్లు 69 సెట్లతో దాఖలయ్యాయని సీఈవో వికాస్ రాజ్ వెల్లడించారు. అత్యధికంగా సికింద్రాబాద్, నిజామాబాద్‌లలో ఆరు గురు, భువనగిరి, మల్కాజ్‌గిరి, మహబూబ్‌నగర్‌లో ఐదుగురు నామినేషన్లు సమర్పించారు. మహబూబాబాద్, నల్లగొండ, మెదక్‌లో నలుగురు.. పెద్దపల్లి, జహీరాబాద్, చేవెళ్ల, వరంగల్‌లో ముగ్గురు.. హైదరాబాద్‌లో ఇద్దరు.. ఖమ్మం, నాగర్ కర్నూలు, కరీంనగర్, ఆదిలాబాద్‌లో ఒక్కరు నామినేషన్లు దాఖలు చేశారు. రెండు రోజుల్లో మొత్తం 98 మంది అభ్యర్థులు 117 సెట్లు రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కలెక్టరేట్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజామ్మిల్‌ఖాన్‌కు రెండు సెట్ల నామినేషన్ పత్రాలు సమర్పించారు. మహబూబ్‌నగర్ స్థానానికి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి తరపున ప్రతిపాదకులు టి.శ్రీధర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, నిజామాబాద్ స్థానానికి బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ నామినేషన్లు దాఖలు చేశారు. సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి తీగుల్ల పద్మారావుగౌడ్ సికింద్రాబాద్ అదనపు కలెక్టర్, రిటర్నింగ్ ఆఫీసర్ పాటిల్ హేమంత్ కేశవ్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు.

ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్‌కు నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తున్న కొప్పుల ఈశ్వర్

कर्मचारी भविष्य निधि संगठन
ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ
(श्रम एवं रोज़गार मंत्रालय,भारत सरकार)
(కార్మిక & ఉపాధి మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం)
वसूली अधिकारी,क्षेत्रीय कार्यालय, कुकटपल्ली/రికవరీ ఆఫీసర్, రీజినల్ ఆఫీస్, కూకట్‌పల్లి
प्रशांति नगर, टी.एस.आर.टी.सी बस कॉम्प्लेक्स, पहली और दूसरी मंजिल,'वाई' जंक्शन के पास,कुकटपल्ली, हैदराबाद
ప్రశాంతినగర్, టిఎస్ఆర్‌టిసి బస్ కాంప్లెక్స్,1వ & 2వ అంతస్తు, 'వై' జంక్షన్ దగ్గర, కూకట్‌పల్లి, హైదరాబాద్-500018
ల్యాండ్ లైన్: 040-29703775, ఫ్యాక్స్: 040-29707720,
ఇ-మెయిల్: ro.kukatpally@epfindia.gov.in వాట్సాప్ హెల్ప్ లైన్ నం. 9392369549

బహిరంగ వేలం/అమ్మకం

షెడ్యూల్‌లో తెలిపిన r/o. M/s. సీడ్ ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఫ్లాట్ నం. 501A & 510B, శ్రీ సుభాన్ సిరి సంపద కాంప్లెక్స్, రాజ్‌భవన్ రోడ్డు, హైదరాబాద్ (డిఫాల్టింగ్ ఎస్టాబ్లిష్‌మెంట్)లో స్థిరాస్తి అమ్మకం EPF & MP యాక్ట్ 1952లోని సెక్షన్ 8(B)(1)(a) క్రింద అటాచ్ చేయబడినది మరియు అది ఆస్తి సైట్ వద్ద బహిరంగ వేలం ద్వారా 25 ఏప్రిల్, 2024న ఉదయం 11.00 గంటలకు బహిరంగ వేలం ద్వారా రికవరీ ఆఫీసర్, ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్, రీజినల్ ఆఫీస్, కూకట్‌పల్లి, హైదరాబాద్ ద్వారా **ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా ప్రాతిపదికన** షెడ్యూల్ చేయబడినది.

ఆస్తి షెడ్యూల్

ఆస్తి నం.	బహిరంగ వేలంలో విక్రయించబడే ఆస్తి వివరణ	పరిమాణం	రిజర్వు ధర
1.	3 BHK ఫ్లాట్, నార్త్ ఈస్ట్ ఫేస్ ఎంట్రన్స్ **యజమాని:** శ్రీ పి. విద్యాసాగర్, ఫ్లాట్‌నం. 501A & 501 B, శ్రీ సుభాన్ సిరి సంపద కాంప్లెక్స్, రాజ్‌భవన్ రోడ్డు, హైదరాబాద్	5వ అంతస్తులో 1967.00 చ.అడుగుల ప్లింత్ ఏరియా, సూపర్ బిల్టప్ ఏరియా 2186.00 చదరపు అడుగులు, కార్పెట్ ఏరియా 1748.8 చ.అడుగులు	రూ. 132.06 (లక్షలు)

నియమ నిబంధనలు:

1. పైన తెలిపిన ఆస్తి షెడ్యూల్‌లో పేర్కొన్న ఒక్కొక్క ఆస్తికి ఎదురుగా తెలిపిన రిజర్వు ధర కంటే తక్కువకు విక్రయించబడదు.
2. డెటార్/డిఫాల్టర్ ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్‌కు బకాయి మొత్తం చెల్లించినట్లయితే వేలం/అమ్మకం రద్దు చేయబడుతుంది. వేలం వాయిదా వేయుట లేదా రద్దుచేయు వేలం నిర్వహించు అధికారి విచక్షణ మేరకు ఉంటుంది.
3. వేలం/అమ్మకంలో పాల్గొనుటకు ఆసక్తి గల వ్యక్తులు బయానా అనగా అంచనా విలువ అనగా రూ. 3.96 లక్షలలో 3% డిపాజిట్ చేయాలి. గెలుపొందిన బిడ్డరు విషయంలో డిపాజిట్ చేసిన మొత్తం బిడ్ మొత్తం నిమిత్తం సర్దుబాటు చేయబడుతుంది. గెలుపొందని బిడ్డరు విషయంలో డిపాజిట్ చేసిన మొత్తం వేలం ముగింపు తరువాత వాపసు చేయబడుతుంది.
4. గెలుపొందిన బిడ్డరు పేరున ఒకసారి బిడ్ కొట్టివేయబడిన తరువాత, అతను/ఆమె అదే రోజులోగా బిడ్ మొత్తంలో 25% డిపాజిట్ చేయాలి మరియు మిగిలిన మొత్తాన్ని అమ్మకం తేదీ నుండి 15 రోజులలోగా చెల్లించాలి. లేనియెడల బయానా నిమిత్తం గెలుపొందిన బిడ్డరు చెల్లించిన మొత్తం జప్తు చేయబడుతుంది మరియు ఎటువంటి కారణాలు తెలియజేయకుండా ఆస్తి తిరిగి వేలం వేయబడుతుంది.
5. ప్రతీసారి బిడ్డింగ్ రూ. 50,000/- పెంచబడుతుంది. బిడ్ మొత్తం పరంగా లేదా బిడ్డరు పరంగా ఏదేని వివాదం ఎదురైన సందర్భంలో, లాట్ మళ్ళీ ఒకసారి వేలానికి ఉంచబడుతుంది.
6. పైన తెలిపిన ఆస్తిపై ఏదేని చెల్లించవల్సిన కన్వేయన్స్ నిమిత్తం ఛార్జీలు మరియు పన్నులు/సుంకాలు గెలుపొందిన బిడ్డరు భరించాలి.
7. అన్ని వివాదాల క్రింద రికవరీ ఆఫీసర్ నిర్ణయం తుదిగా ఉంటుంది.
8. పాల్గొనువారు 23-04-2024 మరియు 24-04-2024న మధ్యాహ్నం 3.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు ఆస్తి తనిఖీ చేసుకోవచ్చును. దీనికి సంబంధించి వారు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్, రీజినల్ ఆఫీస్, కూకట్‌పల్లి, హైదరాబాద్ వారిని సంప్రదించవచ్చును. సంప్రదించండి: శ్రీమతి టి. భూలోకేశ్వరి, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్: 9701512689.

ప్రదేశం: రీజినల్ ఆఫీస్, కూకట్‌పల్లి — సం/- రికవరీ ఆఫీసర్,
తేది: 18-04-2024 — రీజినల్ ఆఫీస్, కూకట్‌పల్లి

ఎత్తు పెంచుడు.. నిండా ముంచుడే

మొదటిపేజీ తరువాయి...

రాజకీయ ప్రయోజనాలే లక్ష్యంగా కేంద్రం మొండిగా, దూకుడుగా వ్యవహరిస్తున్నది. గోదావరి-కావేరి నదుల అనుసంధానం ద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడులోని ప్రాంతాలకు సాగునీరు, తాగునీరు అందిస్తామంటున్న కేంద్రం.. తాజాగా సరికొత్త ప్రతిపాదన చేసింది. మేడిగడ్డను విడిచిపెట్టి, ఇచ్చంపల్లి వద్ద ఎత్తు పెంచి బరాజ్‌ను నిర్మించి, అక్కడి నుంచి జలాలను కావేరి నదికి తరలించాలని సన్నాహాలు చేస్తున్నది. ప్రస్తుతం ప్రతిపాదించిన 87 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ (ఫుల్ రిజర్వాయర్ లెవల్) వద్ద 15.88 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో ఇచ్చంపల్లి బరాజ్‌ను నిర్మిస్తే, దాదాపు 23 వేల ఎకరాలు ముంపునకు గురవుతాయి. వాటితోపాటు మంథని పరిధిలో తొమ్మిది గ్రామాలు మునిగిపోతాయి. దాదాపు 21,575 మంది నిర్వాసితులవుతారు. ఇది ప్రాథమిక అంచనా మాత్రమే. ఇప్పుడు ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదిస్తున్నట్టుగా బరాజ్ ఎత్తును మరింత పెంచితే, అంతకు మూడింతల స్థాయిలో మునక తప్పదనే ఆందోళన వ్యక్తమవుతున్నది. గోదావరి-కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టుకు సంబంధించిన నిర్దేశిత నీటి లక్ష్యాలు నెరవేరాలన్నా, ఎగువన కాళేశ్వరం ప్రాజెక్టు నీటి అవసరాలు తీరాలన్నా ఇచ్చంపల్లి వద్ద కనీసం 30-40 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో ప్రాజెక్టును కచ్చితంగా నిర్మించాల్సి ఉంటుందని ఇంజినీర్ల అభిప్రాయం. అంత సామర్థ్యంతో బరాజ్‌ను నిర్మిస్తే ఇప్పుడున్న అంచనాలకు మూడింతలకుపైగా భూమి ముంపునకు గురికాక తప్పదు. అదేవిధంగా ముంపు గ్రామాల సంఖ్య, నిర్వాసితులయ్యేవారి సంఖ్య సైతం పెరగకమానదు. ప్రాజెక్టు ప్రతిపాదిత స్థలం యావత్ దట్టమైన అటవీ ప్రాంతమే. పర్యావరణపరంగానూ తెలంగాణకు తీరని నష్టమే. నదుల అనుసంధానం ప్రక్రియలో భాగంగా గోదావరి జలాలను ఇచ్చంపల్లి నుంచి నాగార్జునసాగర్‌కు తరలించేందుకు 315.81 కిలోమీటర్ల మేర కాలువ తవ్వాల్సి ఉంటుంది. వరంగల్, ఖమ్మం, నల్లగొండ మీదుగా వెళ్లే ఈ కాలువ నిర్మాణానికి 18,661 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంటుంది. ఈ రకంగానూ తెలంగాణ రైతాంగం తీవ్రంగా నష్టపోవడం ఖాయం.

ఎగువన ఎత్తిపోసుకోలేం

మేడిగడ్డ బరాజ్‌ను పునరుద్ధరించకపోతే, ఇచ్చంపల్లి ఎత్తును పెంచి అక్కడి నుంచే గోదావరి జలాలను తెలంగాణ వినియోగించుకునే అవకాశం ఉంటుందని ఎన్‌డబ్ల్యూడీఏ కొత్త వాదన తెస్తున్నది. ఆచరణలో అది అంత సులువేమీ కాదని ఇంజినీర్ల అభిప్రాయం. నదుల అనుసంధానం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా చేపడతారు. కాబట్టి, నిర్వహణ మొత్తం కేంద్రం నియంత్రణలో ఉంటుంది. దీంతో ఇచ్చంపల్లి బరాజ్ నుంచి నీటి వినియోగంపై తెలంగాణకు నియంత్రణ ఏమాత్రం ఉండదు. మేడిగడ్డ బరాజ్ ఉండటం వల్ల కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని ఏ ఆయకట్టుకు, ఎక్కడ నీళ్లు తక్కువ పడినా, ఎప్పుడంటే అప్పుడు ఎత్తిపోసుకునేందుకు ఇప్పుడున్న వెసులుబాటు పూర్తిగా తొలిగిపోతుందని ఇంజినీర్లు హెచ్చరిస్తున్నారు. అదే జరిగితే కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష్యాలు నెరవేరడం ప్రశ్నార్థకమేనని ఇంజినీర్లు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

తెలంగాణకు దక్కే ప్రయోజనాలు శూన్యం

నదుల అనుసంధానం ప్రాజెక్టుతో ఇటు ముంపు విషయంలో, అటు జలాల వినియోగంలోనూ తెలంగాణకు తీవ్రంగా నష్టం వాటిల్లుతున్నా, ప్రాజెక్టు ద్వారా ఒనగూరే ప్రయోజనాలు మాత్రం నామమాత్రమే. గోదావరి నుంచి కావేరికి తరలించే జలాల్లో ఆవిరి ప్రవాహ నష్టాలు పోగా ఆంధ్రప్రదేశ్‌కు 44 టీఎంసీలు, తెలంగాణకు 45, తమిళనాడుకు 38, పుదుచ్చేరికి 2.2, కర్ణాటకకు 16 టీఎంసీలను అందించాలని ప్రతిపాదించింది. దీనిని బట్టి ముంపుపరంగా అత్యధికంగా నష్టపోతున్న తెలంగాణ ఆ ప్రాజెక్టు ఫలాలను పొందడంలో మాత్రం తీవ్రంగా నష్టపోతుంది. అయినప్పటికీ, బీజేపీ సర్కారు జాతీయ ప్రయోజనాల పేరిట తెలంగాణ ప్రయోజనాలను తుంగలో తొక్కుతున్నది. తెలంగాణను నిలువునా ముంచే ప్రణాళికలను మొండిగా అమలు చేసేందుకు సిద్ధమవుతున్నది.

దిగువన వాడుకోలేం

ఇచ్చంపల్లి దిగువన దుమ్ముగూడెం వరకు గోదావరి జలాలను సైతం తెలంగాణ పూర్తి స్థాయిలో వినియోగించుకోలేని దుస్థితి ఏర్పడుతుందని ఇంజినీర్లు హెచ్చరిస్తున్నారు. ఎలాగంటే, ఇచ్చంపల్లి దిగువన దేవాదుల కోసం 38 టీఎంసీలు, సమ్మక్కసాగర్ బరాజ్ నుంచి 47 టీఎంసీలు, ప్రస్తుతం నిర్మిస్తున్న సీతమ్మసాగర్ నుంచి 67 టీఎంసీలు, మోడికుంట నుంచి 1.5 టీఎంసీలు మొత్తంగా 153.5 టీఎంసీల గోదావరి జలాలను వినియోగించుకోవాల్సి ఉంటుంది. ఆ మేరకు జలాలు ఎగువన ఉన్న ఇచ్చంపల్లి నుంచే దిగువకు రావాల్సి ఉంటుంది. అయితే, కేంద్ర ప్రభుత్వం నదుల అనుసంధానం ప్రాజెక్టులో గోదావరి జలాల మళ్లింపునకే తొలి ప్రాధాన్యం ఇస్తే, దిగువన ఉన్న సమ్మక్క బరాజ్, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల కింద ఉన్న ఆయకట్టుపై తీవ్ర ప్రభావం పడుతుంది. కేంద్ర అనుమతిస్తేనే ఇచ్చంపల్లి నుంచి దిగువకు జలాలు వస్తాయి. దీంతో ఎగువన నీటిని ఎత్తిపోసుకోవాలన్నా, దిగువన వాడుకోవాలన్నా ప్రతి నీటి చుక్కకూ కేంద్రం ఎదుట తెలంగాణ మోకరిల్లాల్సిన దుస్థితి నెలకొంటుందని ఇంజినీర్లు స్పష్టంచేస్తున్నారు.

టాస్క్‌ఫోర్స్ కమిటీ భేటీలో ఇచ్చంపల్లిపై చర్చ

- తెలంగాణకు ఇబ్బంది ఉండబోదు: టాస్క్‌ఫోర్స్ కమిటీ
- డీపీఆర్ ఆమోద డెడ్‌లైన్‌పై వెనక్కితగ్గిన ఎన్‌డబ్ల్యూడీఏ

హైదరాబాద్, ఏప్రిల్19 (నమస్తే తెలంగాణ): ఢిల్లీలో శుక్రవారం నిర్వహించిన నదుల అనుసంధానం ప్రాజెక్టు టాస్క్‌ఫోర్స్ కమిటీ 19వ సమావేశంలో ఇచ్చంపల్లి బరాజ్ ఎత్తు పెంపు అంశంపై చర్చ కొనసాగింది. మేడిగడ్డ బరాజ్‌ను పునరుద్ధరించకపోతే ఇచ్చంపల్లి బరాజ్ ఎత్తును పెంచి, అక్కడి నుంచే మేడిగడ్డ అవసరాలను తీర్చుకోవచ్చనే సరికొత్త ప్రతిపాదనను ఎన్‌డబ్ల్యూడీఏ తెరమీదకు తీసుకొచ్చింది. ఈ అంశంపై టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో చర్చించారు. ఎత్తు పెంపు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఎన్‌డబ్ల్యూడీఏకు కమిటీ సూచించినట్టు తెలిసింది. ఇదిలా ఉంటే గోదావరి, కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టు వల్ల తెలంగాణ నీటి వాటాకు, సమ్మక్క-సారక్క ప్రాజెక్టుపై ఎలాంటి ప్రభావం ఉండబోదని పేర్కొన్నట్టు సమాచారం. నదుల అనుసంధానం ప్రాజెక్టు వల్ల తెలంగాణకు ప్రయోజనం చేకూరుతుందని, దాదాపు 47 టీఎంసీల గోదావరి జలాలను వాడుకునే అవకాశం దక్కుతుందని టాస్క్‌ఫోర్స్ కమిటీ అభిప్రాయం వ్యక్తంచేసినట్టు వినికిడి.

ప్రాజెక్టు ఆమోదానికి గడువేమీ లేదు

గోదావరి-కావేరి అనుసంధానం ప్రాజెక్టు ముసాయిదా డీపీఆర్ ఆమోదానికి రాష్ట్రాలకు విధించిన గడువును ఎన్‌డబ్ల్యూడీఏ ఎత్తేసింది. ప్రాజెక్టు డీపీఆర్‌పై అభ్యంతరాలు, సూచనలను నెలాఖరులోగా తెలపాలని, లేదంటే ఆమోదించినట్టుగానే పరిగణనలోకి తీసుకుంటామని రాష్ట్రాలకు ఇటీవల ఎన్‌డబ్ల్యూడీఏ ఆల్టిమేటం జారీ చేసింది. దానిపై విమర్శలు వెల్లువెత్తడంతో ఆ డెడ్‌లైన్‌ను ఎత్తేసింది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత ప్రభుత్వాలు ఏవిధమైన విధాన నిర్ణయాలు తీసుకోవడానికి వీల్లేని సమయంలో ఇలాంటి షరతులు పెట్టడమేమిటని పలు రాష్ట్రాలు ఎన్‌డబ్ల్యూడీఏ తీరును తీవ్రంగా ఆక్షేపించాయి. దీంతో ఎన్‌డబ్ల్యూడీఏ నిర్దేశిత గడువును ఎత్తేసింది. ఈ మేరకు రాష్ట్రాలకు సమాచారం అందించినట్టు తెలిసింది.

• రేవంత్‌రెడ్డికి ఉత్తరాలతో రైతుల నిరసన

రేవంత్ సర్కార్ తమ సమస్యలను పట్టించుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం పొచ్చర గ్రామానికి చెందిన రైతులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పోస్టుకార్డులు రాశారు. ఎకరానికి రూ.15 వేలు, రూ.2 లక్షల రుణ మాఫీ అమలు చేస్తామని చెప్పి, నాలుగున్నర నెలలు గడిచినా పట్టించుకోవడం లేదంటూ మండిపడ్డారు. రైతు కూలీలకు రూ.12 వేలు, పంటలకు రూ.500 బోనస్‌లాంటి హామీలు నీటి మూటలయ్యాయని ఆ ఉత్తరాల్లో పేర్కొన్నారు.

- ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ